తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

హైదరాబాద్ - రంగారెడ్డి

మేడ్చల్ మల్కాజిగిరి   వికారాబాద్

పేజీలు : 08

# తుమ్మలూరును తోవ్వేస్తున్నారు





## మహేశ్వరం కందుకూరు మండలాల్లో గుట్టలు మాయం?

### జోరుగా మట్టి దందా.. పట్టించుకోని అధికారులు

**మహేశ్వరం,నవంబర్10(జనం సాక్షి):**

మహేశ్వరం కందుకూరు మండలాలలో ప్రకృతి సహజ సిద్ధంగా ఉన్న గుట్టలను అక్రమార్కులు రాత్రికి రాత్రే మాయం చేస్తున్నారు.కొందరు అక్రమార్కులు అసైన్డ్ మెంట్ భూములల్లో,ప్రభుత్వ భూములల్లో రాత్రిపూట మట్టిదందా మూడు పువ్వులు ఆరు కాయలు అన్న చందంగా నడిపిస్తున్నారు.ప్రకృతి సహజ సంపందను కొంతమంది అక్రమార్కులు సొమ్ము చేసుకొని లక్షలు దండుకుంటున్నారు. అక్రమార్కులు రాత్రి పూట గుట్టు చప్పుడు కాకుండా ఎర్రమట్టి,నల్లమట్టి, మొర్రాన్ని మహేశ్వరం మండలంలోని ప్లాస్టిక్ పార్క్,ఈ సిటీ,హార్డ్ వేర్ పార్క్,అమెజన్, వెంచర్లలకు, విల్లాలకు, పలు కంపెనీలకు గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్నారు. అక్రమార్కులు ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు లేకుండానే మట్టిని పాతాళంలోకి తోవ్వుతున్నారు.మరికొంత మంది అక్రమార్కులు గోరంత అనుమతి తీసుకొని కొండంత తవ్వేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.టిప్పర్లలల్లో ఓవర్ లో నింపడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.రైతులకు ఒక్క ట్రిప్ కు 200-300 రూపాయలు ఇచ్చి కొనుగోలు చేస్తున్నారు.అక్రమార్కులు 4000-5000 రూపాయలకు అమ్ముకుంటున్నారు.మహేశ్వరం ,కందుకూరు మండలాలలో రెవిన్యూ,మైనింగ్ శాఖ నుంచి ఎటువంటి అనుమతులు తీసుకోకుండానే తవ్వకాలు జరుపుతున్నారు.మట్టి దందాను కొంతమంది ఉపాధి అవకాశంగా ఉపయోగించుకుంటున్నారు.అక్రమ మట్టి దందాను అరికట్టడంలో రెవిన్యూ,మైనింగ్ శాఖ అధికారులు విఫలమయ్యారని పలువురు ఆరోపిస్తున్నారు.మట్టి మాఫియా నుంచి రెవిన్యూ,మైనింగ్ శాఖ అధికారులు మామూళ్లు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

మహేశ్వరం మండలం తుమ్మలూరు గ్రామ రెవిన్యూ పరిధిలోని సర్వే నంబర్ 315 లావాణి భూమిలో అక్రమార్కులు మట్టిని పాతాళంలోకి తోవ్వుతున్నారు. రెవిన్యూ, మైనింగ్ శాఖల నుంచి ఎటువంటి అనుమతులు లేకుండానే తవ్వకాలు జరుపుతున్నారు. పచ్చని చెట్లతో ఉన్న ప్రకృతిని పిండి చేస్తున్నారాని పలువురు ఆరోపిస్తున్నారు.తుమ్మలూరు గ్రామంలో జరిగే మట్టి మాఫియాను అరికట్టాలని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

**మహేశ్వరం కందుకూరు మండలాల్లో జోరుగా మట్టిదందా**

మహేశ్వరం మండలంలోని మహేశ్వరం,తుమ్మలూరు, ఉప్పుగడ్డ తండా, గంగారం, హర్షగూడ, కొత్తతండా,నాగారం,కల్వకోల్,కోళ్ల పడకల్, ఆకాన్ పల్లి, మన్సాన్ పల్లి, కేసీతండా, గంగారం, శ్రీనగర్,రావిర్యాల గ్రామాలలో, కందుకూరు మండలంలోని నేదునూరు,దెబ్బడగూడ,జైత్వారం,పులిమామిడి,పెద్దమ్మ తండా, మీర్కాన్ పేట్, తిమ్మాపూర్, రాచులూరు, గూడూరు, బేగం పేట్, మాదాపూర్, ఆకులమైలారం, లేమూరు, మండలంలోని పలు గ్రామాలలో రాత్రిపూట అక్రమార్కులు జోరుగా మట్టిదందాను నడిపిస్తున్నారు.మట్టి మాఫియా పై స్థానికులు రెవిన్యూ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదంటున్నారు.రెవిన్యూ, మైనింగ్ శాఖ అధికారులు మట్టి మాఫియా తో కుమ్మక్కయ్యారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.ఇప్పటికైనా కందుకూరు,మహేశ్వరం రెవిన్యూ మండలాల పరిధిలో జరిగే అక్రమ మట్టి మాఫియాను అరికట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



## ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్న రెవెన్యూ అధికారులు

- పైప్ లైన్ పనులు నిలిపివేత
- ప్రభుత్వ సూచిక బోర్డ్ ఏర్పాటు
- బాధ్యులపై కఠిన చర్యలు



**మొయినాబాద్ నవంబర్ 10 జనం సాక్షి :** అమ్డాపూర్ గ్రామ రెవెన్యూ పరిదిలోని ప్రభుత్వ భూమి సర్వే నేం.33 సుమారు 0-25 గుంటల భూమిని పక్కన భూమి వున్న వ్యక్తి కబ్జా చేసి తన భూమిలో కలిపి వేసి పైపు లైన్ వేయడం జరుగుతుందని గ్రామస్తుల పిర్యాదు మేరకు తహసీల్దార్ కె. గౌతమ్ కుమార్ రెవెన్యూ సిబ్బందితో కలిసి కబ్జా జరుగుతున్న స్థలాన్ని పరిశీలించి పనులను నిలిపివేయించారు. విచారణ అనంతరం అట్టి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకొని ప్రభుత్వ సూచిక బోర్డ్ ఏర్పాటు చేయడం జరిగినది. ప్రభుత్వ భూములను ఎవ్వరూ కబ్జా చేసిన కఠిన చర్యలు తప్పవని క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించడం జరిగినది.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కె. గౌతం కుమార్ తో పాటు రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాజేశ్, సర్వేయర్ జలజ, జీపీఓ రాజేశ్వర్ మరియు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## మంత్రి అజారుద్దీన్‌కు శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్ర హజ్ కమిటీ మెంబర్ ముజీబుద్దిన్



**శామీర్ పేట్ ( జనం సాక్షి) :** తెలంగాణ మంత్రివర్గంలో నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన కాంగ్రెస్ నాయకుడు భారత మాజీ క్రికెట్ కెప్టెన్, మహమ్మద్ అజారుద్దీన్ సోమవారం రోజు సచివాలయంలో మంత్రి గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా రాష్ట్ర హజ్ కమిటీ మెంబర్ మహమ్మద్ ముజబుద్దీన్ సచివాలయంలో అతన్ని కలిసి నూతనంగా ప్రమాణ స్వీకారం చేసినందుకుగాను అతనికి శుభాకాంక్షలు తెలియజేశారు.

## ప్రజావాణికి మండల స్థాయి కీలక అధికారుల డుమ్మా

- రోజురోజుకు ఆదరణ కరువైన ప్రజావాణి కార్యక్రమం
- సోమవారం ప్రజావాణికి ఒక్క దరఖాస్తు

బొంరాస్ పేట,నవంబర్ 10 (జనం సాక్షి):ప్రజలు జిల్లా కేంద్రంలోని ప్రజావాణికి వెళ్లకుండా మండల కేంద్రంలోనే ప్రతి సోమవారం ప్రజావాణి నిర్వహించి ప్రజా సమస్యలను పరిష్కరించాలని ఆదేశిస్తూ ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుండి ఆదరణ కరువైంది.సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఒక్క దరఖాస్తు రావడం జరిగిందని ఎంపీడీవో వెంకన్ గౌడ్ తెలిపారు.ప్రజల్లో అవగాహన కల్పించి ప్రజావాణికి వచ్చి ప్రజలు స్వేచ్ఛగా దరఖాస్తు చేసుకునేందుకు అవగాహన కల్పించాల్సిన కీలక మండల అధికారులే ప్రజావాణికి డుమ్మా కొడుతుండడంతో ప్రజావాణిపై ప్రజలకు నమ్మకం లేకుండా పోయిందని బహిరంగంగానే మండల ప్రజలు వాపోతున్నారు.కొంతమంది దరఖాస్తు చేసుకున్న పరిష్కారం కాకపోవడంతో జిల్లా కేంద్రంలోని ప్రజావాణికి వెళుతున్నారు.పలు శాఖల నుండి మండల స్థాయి అధికారులు హాజరు కాకపోవడం కిందిస్థాయి ఉద్యోగులను ప్రజావాణికి పంపించడం వంటి సంఘటనలు కనిపిస్తున్నాయి.ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి ప్రతి మండల స్థాయి అధికారి ప్రజావాణి కార్యక్రమంలో ఉదయం 10 నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు హాజరయ్యి దరఖాస్తులు స్వీకరించేలా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.



# మైత్రి నగర్ ఫేస్ 3 స్ట్రామ్ డ్రైయిన్ సమస్యను పరిష్కరించండి






**ప్రజావాణిలో మిద్దల మల్లారెడ్డి**

**శేరిలింగంపల్లి, నవంబర్ 10 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం హఫీజ్పేట్ డివిజన్ పరిధిలోని మైత్రి నగర్ ఫేస్ 3 లోగల పార్కులో జిహెచ్ఎంసి అధికారులు రెయిన్ వాటర్ స్ట్రామ్ డ్రైన్ సమస్యను సత్వరమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సామాజికవేత్త, తెలంగాణ ఉద్యమకారుడు మిద్దెల మల్లారెడ్డి సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా చందానగర్ సర్కిల్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హఫీజ్పేట్ డివిజన్ పరిధి మైత్రి నగర్ ఫేస్ 3 పార్కులో రైన్ వాటర్ స్ట్రామ్ డ్రెయిన్ నాలా కోసం మట్టిని తవ్వి దానిని పక్కనే కుప్పలు కుప్పలుగా పడేయడం జరిగిందని, అయితే డ్రైనేజీని మొత్తం ఓపెన్ గా ఉంచడంతో పార్కులో అది సమస్యగా మారిందన్నారు. డ్రెయిన్ కోసం తవ్వగావచ్చిన మట్టిని అదే పార్కులో అలాగే ఉంచడం ఎంతవరకు సమంజసం అని, పట్టణ ప్రాంతాలలో ప్రతి గజము విలువ లక్షలలో ఉంటుందని, మరి ఇంత ఖరీదైన స్థలాన్ని ప్రజా ప్రయోజనాల కోసం కేటాయింపులో భాగంగా పార్కును నిర్మించి అందులో వాస్తవికతకు దూరంగా వర్షం నీటి నాలాను నిర్మించి అడ్డగోలుగా వదిలేయడంతో ఎంతో విలువైన భూమి ప్రజా ప్రయోజనాలకు దూరంగా ఉండడం ఆవేదనను కలిగించిందన్నారు. ప్రజలకు వాకింగ్ చేయడానికి సదుపాయంగా లేదని, చిన్నపిల్లలు ఆడుకోవడానికికూడా ఉపయుక్తంగా లేదని చందానగర్ సర్కిల్ ఉప కమిషనర్ స్వయంగా మైత్రి నగర్ ఫేస్ 3 పార్కును పరిశీలించి సమస్య సత్వర పరిష్కారానికి కృషి చేయాలని ఆయన కోరారు.

**గౌతమి నగర్ లో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోండి... కసిరెడ్డి**

చందానగర్ సర్కిల్ గౌతమి నగర్ కాలనీలో ఓ బిల్డర్ సెల్లార్ మరియు పార్కింగ్ స్థలంలో అక్రమ నిర్మాణాలను చేపట్టి గౌతమి నగర్ కాలనీవాసులకు తలనొప్పిగా మారాడని, చందానగర్ సర్కిల్ అధికారులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని సమస్య పరిష్కారానికి కృషి కృషి చేయాలని జనం కోసం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కసిరెడ్డి భాస్కర్ రెడ్డి డిమాండ్ చేశారు. కనీస నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా ఎలా పడితే అలా అక్రమ నిర్మాణాలు కొనసాగిస్తుంటే జిహెచ్ఎంసి అధికారులు చూస్తూ కూర్చోకూడదని, కాలనీవాసుల అభ్యర్థన మేరకు సత్వర సమస్య పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

# ప్రజావాణి వినతులపై సత్వర చర్యలు చేపడతాం... జోనల్ ఏసిపి మెహ్రా

**శేరిలింగంపల్లి, నవంబర్ 10 (జనంసాక్షి) :** ప్రజలు ఎంతో నమ్మకంతో ప్రజావాణి కార్యక్రమానికి హాజరవుతూ ఆయా సమస్యలపై వినతులను సమర్పిస్తుంటారని, ఇందుకోసం సంబంధిత ప్రతి అధికారి ప్రథమ ప్రాధాన్యతను కేటాయిస్తూ సత్వర పరిష్కారానికి కృషి చేయాలని శేర్లింగంపల్లి జోనల్ అసిస్టెంట్ చీఫ్ సిటీ ప్లానర్ మెహ్రా పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో జనం కోసం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కసిరెడ్డి భాస్కర్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదులో భాగంగా శేరిలింగంపల్లి సర్కిల్ అంజయ్య నగర్ పరిధి సర్వేనెంబర్ 134, 135, 136 ఏపిహెచ్బి లేఅవుట్ లోని ఒక ఎకరా 20 గుంటల భూమిని అప్పట్లో ప్రజా అవసరాల నిమిత్తం పార్కు స్థలంగా కేటాయించడం జరిగిందని, అక్కడ కొందరు ప్రైవేటు వ్యక్తులు ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపట్టి చాలావరకు స్థలాన్ని కబ్జా చేయడం జరిగిందని, ఇప్పటికే ఎన్నో దఫాలుగా ఎంతోమంది సదరు కబ్జాలపై ఎన్ని ఫిర్యాదులు అందజేసిన ఎలాంటి ఫలితం లేకపోవడం విచారకరమని, జిహెచ్ఎంసి అధికారులు ఏమైనా అమ్ముడు పోతే చెప్పండి మళ్లీ దాని గురించి ప్రస్తావించమని కసిరెడ్డి ఘాటుగా స్పందించడంతో అవాక్కైన శేరిలింగంపల్లి జోనల్ అసిస్టెంట్ చీఫ్ సిటీ ప్లానర్ మెహ్రా చాలా సానుకూలంగా స్పందించడం జరిగిందని తెలిసింది. ఇందులో భాగంగా మెహ్రా మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమం శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయం పరిధిలోని సర్కిలలో విస్తృతంగా కొనసాగిందన్నారు. శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో అధికారులు ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించడం జరిగిందని, అంతే బాధ్యతతో సంబంధిత ఇష్యుల పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని భరోసాను వ్యక్తం చేశారు. పట్టణ ప్రణాళిక, ఇంజినీ రింగ్, ఎలక్ట్రికల్, యూబిడి, వెటర్నరీ, సానిటేషన్ విభాగాల అధికారులంతా ప్రజావాణిలో నమోదయ్యే ఫిర్యాదులను ప్రత్యేకంగా పరిగణించి వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఇందులో భాగంగా వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజల నుంచి వినతులను స్వీకరించడం ఎంత అవసరమో అంతే ప్రాముఖ్యతతో వాటిని పూర్తి చేసే బాధ్యతకూడా తమపై అంతే ఉంటుందన్నారు. ప్రజలు తమ సమస్యలను అధికారులకు విన్నవించుకునేందుకు ప్రజావాణి అత్యంత కీలకమైన వేదికన్నారు. ప్రజావాణి సందర్భంగా అర్జీదారులనుండి వచ్చే వినతులు, ఫిర్యాదులపై అధికారులు క్షేత్రస్థాయిలో విచారణను నిర్వహించి తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అర్జీల విషయంలో ఎటువంటి నిర్లక్ష్యం వహించవద్దని, ప్రతి వినతిని విధిగా ఆయా సర్కిళ్లలోని రికార్డులలో నమోదు చేయాలని, నిర్దిష్ట సమయంలో పరిష్కరించి ప్రజలకు సమాచారం అందించాలని జోనల్ అసిస్టెంట్ చీఫ్ సిటీ ప్లానర్ సూచించారు. ప్రతి సోమవారం సర్కిళ్లలో ప్రజావాణి కొనసాగుతున్న సమయంలో సర్కిల్ ఉప కమిషనర్లుసహా వివిధ విభాగాల అధికారులు విధిగా ప్రజావాణిలో అందుబాటులో ఉండాలన్నారు.

# బడేంపల్లి ప్రాథమిక పాఠశాలలో స్పోర్ట్స్ యూనిఫామ్స్ అందజేత

**మండల విద్యధికారి వెంకట్**



**దోమ నవంబర్ 10 జనం సాక్షి :** ఎంపీపీస్ బడేంపల్లి తండా పాఠశాల లో స్పోర్ట్స్ డ్రెస్ నూ తండా వాసులు పాండు నాయక్ (ప్లంబర్ వర్కర్) అందచేయడం జరిగింది. కావున వారిని దోమ మండల విద్యాధికారి వెంకట్ అభినందించారు. ప్రతి పాఠశాలలో దాతలు ముందుకు వచ్చి విద్యార్థులను విద్య పరంగా అనేక విధాలుగా సహాయ సహకారాలు అందించాలన్నారు. ఇప్పటికే దోమ మండలం లో చాలా పాఠశాలలో అనేక మంది దాతలు నోట్ బుక్స్ ,పెన్స్, టీవీ ప్రొజెక్టర్, కుర్చీలు యూనిఫామ్, సుజ్, టై బెల్ట్, లాంటివి అవ్వడం జరిగింది. ఇలా నిరుపేద విద్యార్థులకు విద్య మెటీరియల్ డోనేట్ చేయడం ద్వారా విద్యార్థులను అడ్డుకొన్నవారు ఐతరు అలాగే వారి ఉన్నత చదువులకు సహకరించిన ప్రతి ఒక్కరికి మండల పక్షాన ధన్యవాదాలు అన్నారు.ఈ కార్యక్రమంలో బడేంపల్లి తండా ప్రధానోపాధ్యాయులు తిరుమలేష్, ఉపాధ్యాయులు గోరి బేగం, జడ్పిహెచ్ఎస్ బడేంపల్లి ప్రధానోపాధ్యాయులు విజయకుమార్ ,ఎంపీపీస్ బడెంపల్లి శ్రీనివాస్, కిష్టాపూర్ కాంప్లెక్స్ సిఆర్పి రెడ్యానాయక్, గ్రామ పెద్దలు విద్యార్థులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం చేయాలి

**అల్వాల్, నవంబర్ 10(జనంసాక్షి):** అల్వాల్ సర్కిల్ మచ్చబొల్లారం రాయల్ ఎంక్లేవ్ రోడ్ నం.7, బ్లూ బర్డ్స్ కాలనీ పెద్దలు, కాలనీవాసులు సీసీ రోడ్డు పనులు వెంటనే చేపట్టాలని కోరుతూ సోమవారం కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్‌కి వినతి పత్రం అందజేశారు. ఆ రోడ్డు పనులకు ముందే ఆమోదం లభించినా, కొన్ని సాంకేతిక సమస్యల వలన పనులు నిలిచిపోయి ఉండటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్ మాట్లాడుతూ సమస్యపై సంబంధిత అధికారులతో మాట్లాడి, అతి త్వరలో పనులు ప్రారంభం అయ్యేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ప్రజల అవసరాల కోసం తనవంతు కృషి చేస్తానని తెలిపారు.



# విద్యావిస్తరణకు దాతృత్వ దీవెన

- స్నేహ ఫౌండేషన్ లక్ష విలువైన ఎల్‌జీ టీవీ విరాళం
- పేద విద్యార్థుల భవిష్యత్తుకు డిజిటల్ సాయం

**పరిగి, నవంబర్ 11:** దోమ మండల పరిధిలోని ఎంపీపీఎస్ దిర్శంపల్లి ప్రైమరీ పాఠశాలకు స్నేహ ఫామ్ ఫౌండేషన్ చైర్మన్ రాంరెడ్డి ఒక లక్ష రూపాయల విలువైన ఎల్‌జీ టీవీని విరాళంగా అందజేశారు. ఫౌండేషన్ సభ్యులు సురేష్ రెడ్డి వారి బృందం పాఠశాలకు విచ్చేసి ఈ టీవీని అందించడం జరిగింది. స్నేహ ఫౌండేషన్‌కు మండల విద్యాధికారి (ఎంఈవో) వెంకట్ అభినందనలు తెలిపారు. అన్ని పాఠశాలల్లో దాతలు ముందుకు వచ్చి, పాఠశాలకు అవసరమైన మెటీరియల్‌ను అందించడం ద్వారా నిరుపేద విద్యార్థులకు సహాయం చేయవచ్చని, దీనివల్ల పేద పిల్లలు ఉన్నత చదువులు నేర్చుకునే అవకాశం కలుగుతుందని ఆయన అన్నారు. అలాగే, దిర్శంపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కేశవులు మాట్లాడుతూ, మా పాఠశాలకు లక్ష రూపాయలతో ఎల్‌జీ టీవీ ఇచ్చినందుకు స్నేహ ఫౌండేషన్‌కు తన తరపున, ఉపాధ్యాయులు, విద్యార్థుల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ టీవీ ద్వారా విద్యార్థులు సులువుగా విద్యను నేర్చుకునే అవకాశం లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్, మాజీ చైర్మన్లు, గ్రామ సెక్రెటరీ రాజేష్, హైస్కూల్ హెచ్ఎం శివకుమార్, గ్రామ పెద్దలు కొండ రెడ్డి, హనుమంతు, వెంకట్ రాములు, కాజా, బందెయ్య, శ్రీను, పాఠశాల ఉపాధ్యాయుల బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## లక్ష్మీగూడా దేవాలయంలో విగ్రహాల ప్రతిష్టాపన



**రాజేంద్రనగర్, నవంబర్10(జనం సాక్షి) :** లక్ష్మీగూడా హౌసింగ్ బోర్డ్ కాలనీలోని శ్రీ శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవస్థానంలో గత మూడు రోజులుగా నాగదేవత, అభయాంజనేయ, నవగ్రహాల విగ్రహాల ప్రతిష్టాపన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. దేవాలయ కమిటీ అధ్యక్షుడు అడికె మారప్ప, సభ్యులు హెూమాలు, పూజలు నిర్వహించారు.సోమవారం సాయంత్రం ప్రధాన అతిథిగా రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ పాల్గొని విగ్రహాలను దర్శించారు. అనంతరం ఆయనను దేవాలయ కమిటీ సభ్యులు సన్మానించారు.

## మణికొండ విద్యార్థిని ప్రతిభకు ఘనాభినందనలు



**రాజేంద్రనగర్,నవంబర్10(జనంసాక్షి) :** మణికొండ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థిని చి. మహిమాన్విత (5వ తరగతి) తెలంగాణ రాష్ట్ర స్థాయిలో టీచ్ ఫర్ చేంజ్ పేగా సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలు నిర్వహించిన నృత్య పోటీల్లో ప్రథమ బహుమతి సాధించింది. ఈ విజయానికి గుర్తింపుగా హైదరాబాద్ జిల్లా కలెక్టర్ డి. హరిచందన చిన్నారికి ఏసర్ ల్యాప్‌టాప్ బహుమతిగా అందజేశారు. ఈ సందర్భంగా మణికొండ పాఠశాలలో సోమవారం ఘనంగా సన్మాన కార్యక్రమం జరిగింది. మాజీ ఫ్లోర్ లీడర్ కె. రామకృష్ణారెడ్డి మహిమాన్వితను సన్మానిస్తూ, ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసరాన్ని సూచించారు. "మహిమాన్విత విజయం పాఠశాలకు గర్వకారణం" అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు దశరథ్ నాయక్, నార్సింగి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ఎర్పుల కుమార్, యూత్ కాంగ్రెస్ నాయకుడు శ్రవణ్ కుమార్, గంగాధర్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

**నాగిళ్ల దేవయ్యకు నివాళులర్పించిన సిపిఐ జాతీయ కార్యదర్శి పల్ల వెంకటరెడ్డి**

**హయత్ నగర్, నవంబర్ 10 (జనం సాక్షి) :** భారత కమ్యూనిస్టు పార్టీ రంగారెడ్డి జిల్లా సరూర్ న గర్ మాజీ మండల కార్యదర్శి నాగిళ్ల దేవయ్య సోమవారం సాయంత్రం కర్మాన్ ఘాట్ లోని వారి నివాసంలో గుండెపోటుతో అకాల మరణం చెందారు. వారి మృతదేహానికి భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ కార్యదర్శి పల్ల వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వివెస్ బోస్, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈటి నరసింహ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందోజు రవీంద్ర చారి, రాష్ట్ర సమితి సభ్యులు యాది రెడ్డి, ఎల్బీనగర్ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్ రెడ్డి, ఎల్బీనగర్ నియోజకవర్గం ఏఐటీయూసీ అధ్యక్షులు బోయపల్లి రాములు గౌడ్, మెట్టు మండల కార్యదర్శి హరి సింగ్ నాయక్, ఛాయాదేవి, కమలమ్మ, వెంకటేష్, నాగరాజు, భూషణ్, చంద్రమౌళి, దేవయ్యలు నివాళులర్పించారు.

# అనధికార నిర్మాణంపై చర్యలు కోరుతూ ప్రజావాణిలో ఫిర్యాదు





**అల్వాల్, నవంబర్10(జనంసాక్షి):** సాయినగర్ కాలనీ జొన్నబండలో అనుమతులేని నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని పక్క ఇంటి యజమాని భోజి రెడ్డి అల్వాల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రాన్ని సమర్పించారు. భోజిరెడ్డి మాట్లాడుతూ, తమ ఇంటి పక్కనే ఎలాంటి అనుమతులు లేకుండానే ఇల్లు నిర్మాణం జరుగుతుందని, సెట్బ్యాక్‌లు పాటించకపోవడంతో వర్షకాలంలో నీరు నేరుగా తమ ఇల్లు ప్రాంగణంలోకి ప్రవేశించే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఇందుకు సంబంధించి పలుమార్లు మాట్లాడినప్పటికీ పెద్దగా స్పందన కనిపించకపోవడంతో అధికారులు తక్షణమే పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు.

సంబంధిత అధికారులను సంప్రదించి, ప్రదేశ పరిశీలన చేసి, అవసరమైన పట్టణ ప్రణాళిక నిబంధనలను అమలు చేయాలని భోజి రెడ్డి వినతి పత్రంలో పేర్కొన్నారు.

# కమ్మెట మాజీ సర్పంచ్ హన్మంత్‌రెడ్డికి సేవారత్న జాతీయ అవార్డు

**ఉత్తమ సర్పంచ్‌గా తులసిరాజు**

**చేవెళ్ల, నవంబర్ 10 (జనంసాక్షి)** చేవెళ్ల మండలంలోని కమ్మెట గ్రామానికి గర్వకారణంగా మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ నాయకుడు పట్లోళ్ల హన్మంత్‌రెడ్డి మరో మైలురాయిని అందుకున్నారు. గ్రామ అభివృద్ధి, సామాజిక సేవలలో విశిష్ట కృషి చేసినందుకు బహుజన సాహిత్య అకాడమీ తరఫున ఆయనను సేవారత్న జాతీయ అవార్డు కు ఎంపిక చేసింది. అలాగే కమ్మెట తాజా మాజీ సర్పంచ్ తులసిరాజు ఉత్తమ సర్పంచ్ అవార్డు ను అందుకోబోతున్నారు. హైదరాబాద్‌లోని బహుజన సాహిత్య అకాడమీ జాతీయ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ, అవార్డు ఎంపిక పత్రాలను హన్మంత్‌రెడ్డి, తులసిరాజులకు అందజేశారు. ఈ అవార్డులు వచ్చే నెల డిసెంబర్‌లో తిరుపతిలో జరగనున్న ఆల్ ఇండియా బహుజన రైటర్స్ 18వ నేషనల్ కాన్ఫరెన్స్‌లో ఘనంగా ప్రదానం చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా హన్మంత్‌రెడ్డి, తులసిరాజు మాట్లాడుతూ... సేవలను గుర్తించి




ఇలాంటి అవార్డు ఇవ్వడం మన కృషికి లభించిన గౌరవమన్నారు. గ్రామాభివృద్ధికి మరింత కృషి చేస్తాం అని పేర్కొన్నారు. కార్యక్రమంలో కమ్మెట మాజీ సర్పంచ్ అందిపురం పెంటయ్య, బీఆర్ఎస్ నాయకులు కరుణాకర్ రెడ్డి, ఏ.సురేందర్ గౌడ్, ఏ.బాలకృష్ణ, వెంకటాపురం ఆంజనేయులు గౌడ్, అచ్చిని రాంచెంద్రయ్య, రావులపల్లి వెంకటేష్, సీహెచ్.సంపత్ కుమార్, బహుజన సాహిత్య అకాడమీ రాష్ట్ర అవార్డుల కమిటీ సభ్యుడు కడమంచి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# శివాలయంలో కార్తీకమాస శోభ



తాండూరు నవంబర్ **10(జనంసాక్షి)** : కార్తీక మాసం 3 వ సోమవారం సందర్భంగా శ్రీ భావిగి భద్రేశ్వర స్వామి దేవస్థానంలోని శివుడు మహాదేవ్ అలంకరణలో భక్తులకు దివ్య దర్శనం ఆలయ అర్చకులు విజయ కుమార్ స్వామి కల్పించారు. ఉదయం భక్తులు శివాలయానికి చేరు కుని పరమేశ్వరునికి భక్తి శ్రద్ధలతో మనసారా అభిషేకం చేశారు. ఆలయ అర్చకులు విజయ్ కుమార్ స్వామి ప్రత్యేక అర్చనలతో అదేవిధంగా శివనామస్మరణతో శివాలయం మార్మోగించారు. ఆలయ అర్చకులు విజయ్ కుమార్ స్వామి పరమేశ్వరుని ప్రత్యేక రూపంలో అలంకరించి భక్తులకు దివ్యదర్శన భాగ్యం కల్పించారు. కార్తీక మాసం సందర్భంగా ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై పరమేశ్వరుని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మాట్లాడు తూ ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. భక్తిశ్రద్ధలతో పరమేశ్వరుని కొలవాలని పేర్కొన్నారు. కార్తీక మాసం ప్రతిరోజు ఉదయం శివాలయాన్ని సందర్శించి స్వామివారిని దర్శించుకుంటే అన్నింట శుభాలు జరుగుతాయని వెల్లడించారు.



## దర్గాలో జగదీశ్వర్ రెడ్డి ప్రత్యేక ప్రార్థనలు

**కొడంగల్, నవంబర్ 10 (జనం సాక్షి)** కొడంగల్ మున్సిపల్ మాజీ చైర్మెన్ జగదీశ్వర్ రెడ్డి జన్మదినం సందర్భంగా కొడంగల్ జామే మస్జీద్ వద్ద నిజామ్ షహిద్ దర్గాలో మైనారిటీ నాయకులు ఎస్ఎం. గౌసన్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మాజీ మున్సిపల్ చైర్మెన్ జగదీశ్వర్ రెడ్డి ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకుంటూ ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో హాఫిజ్ అబ్దుల్ రషీద్, అబ్దుల్ కరీం అష్రఫీ, సయ్యద్ ఇసాక్ పాషా, షేక్ సాబేర్ హుసేన్, మొహమ్మద్ హబీబ్, అహ్మద్ ఖాన్, చున్ను మాము, షేక్ షాకీర్ జహేద్ హుస్సేన్, ముఖ్తర్, షకీల్, హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి వ్యతిరేక పోరాటంలో కలిసి రండి

**సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్**

**కుత్బుల్లాపూర్ నవంబర్ 10 (జనం సాక్షి) :** గంజాయి వ్యతిరేక పోరాటంలో అందరు కలిసి ఐకమత్యంతో ముందుకు వెళ్లాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ అన్నారు. నేడు జగద్గిరిగుట్ట లో రాజకీయాల కతీతంగా అఖిలపక్షాల, బస్తి కమిటీల సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరుతూ డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్, ఇన్స్పెక్టర్ వెంకటేష్, ల తో పాటు వివిధ బస్తీల సంక్షేమ సంఘం కమిటీ సభ్యులకు, రాజకీయ పార్టీల నాయకులకు, స్వచ్ఛంద సంస్థల సంఘాలకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఇలాంటి సమావేశాలను ఏర్పాటు చేసి అవగాహన కల్పించడం శుభసూచికమన్నారు.



గంజాయి రహిత జగద్గిరిగుట్ట ప్రాంతం కోసం అందరం కలిసికట్టుగా పని చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు ప్రవీణ్, ఏటీసీ నాయకులు హరినాథ్, బాబు, సిపిఐ నాయకులు వెంకటేష్, జంబు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## 1999-2000 సంవత్సరం పదోవ తరగతి

# పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం

**మర్పల్లి నవంబర్ 9 (జనంసాక్షి)** వికారాబాద్ జిల్లా మర్పల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో 1999-2000 బ్యాచ్ చదివిన పూర్వ విద్యార్థులు మండల కేంద్రంలోని ఎంసీఏ ఫంక్షన్ హాల్ లో 25 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై ఆదివారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఒకరినొకరు యోగక్షేమాలను అడిగి తెలుసుకొని చిన్న నాటి మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి వారి ఆశీస్సులను తీసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. 25 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులు, నాతోటి ఉపాధ్యాయులు ఒకే వేదిక మీద కలుసుకోవడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను మర్చిపోకుండా జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.. ఈ వేదిక మీద కలిసేలా చొరవ చూపిన పూర్వ విద్యార్థులకు ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సర్దార్ మీయ, వీరేశం, విఠల్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## డాక్టర్.. అందెశ్రీ కి నివాళులర్పించిన తెలంగాణ

# ప్రజానాట్యమండలి, సిపిఐ నాయకులు



**కుత్బుల్లాపూర్ నవంబర్ 10( జనం సాక్షి)** తెలంగాణ కవి,గాయకుడు డాక్టర్ అందెశ్రీ హఠాన్మరణం పట్ల మేడ్చల్ జిల్లా తెలంగాణ ప్రజానాట్యమండలి అధ్యక్షులు ప్రవీణ్, కుత్బుల్లాపూర్ ప్రజానాట్యమండలి అధ్యక్షులు దొరవిబాబు ఆధ్వర్యంలో జగద్గిరిగుట్టలో అందెశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర నాయకులు ఏసురత్నం, జిల్లా కార్యదర్శి ఉమామహేష్, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు ప్రవీణ్ లు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో అందెశ్రీ చేసిన కృషి మరువలేనిది అన్నారు. ఆయన రాసిన పలు పాటలను గుర్తు చేసుకుంటూ జోహార్లు తెలియజేశారు. తెలంగాణ రాష్ట్ర గీతంగా గుర్తింపు తెచ్చుకున్న జయ జయహో తెలంగాణ పాట చిరస్మరణీయంగా నిలిచిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో దూదిగే రాములు, బుజ్జిని హరినాథరావు, సహదేవ రెడ్డి, కోమ్ము వెంకటేష్, మేకల శ్రీనివాస్, రాజా గౌడ్, సోమయ్య, జానకిరామ్, నాగప్ప, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

# కొడంగల్ అభివృద్ధికై వాల్ పోస్టర్ విడుదల



**కొడంగల్ ,నవంబర్ 10 (జనం సాక్షి) :** కొడంగల్ అభివృద్ధి కై తరలిరండి అంటూ కెడిపి జెఏసి ఆధ్వర్యంలో అంబేద్కర్ కూడలిలో గోడపత్రిక విడుదల చేశారు. అనంతరం కెడిపి జేఏసీ కొ-కన్వీనర్లు గంటి సురేష్, యు.రమేష్ బాబు, నరేందర్ సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ,ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడూ కొడంగల్ అభివృద్ధి సాధ్యం కాదని, కొడంగల్ అభివృద్ధి కోసం కెడిపి జెఏసి ఆధ్వర్యంలో గత నెలరోజుల నుంచి జరుగుతున్న పోరాటం లో నియోజకవర్గ ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కొడంగల్ అభివృద్ధి కోసం మెడికల్ కాలేజీ, ఇంటిగ్రేటెడ్ గురుకుల భవనాలు కొడంగల్ హెడ్ క్వార్టర్ లోనే నిర్మించాలని, దీనికి నియోజకవర్గ ప్రజల గొంతులు కలపాలని,స్వచ్ఛందంగా ప్రతి పౌరుడు ముందుకు వచ్చి పోరుజేయాలనీ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో భీమరాజు,మాసాని వెంకటయ్య, గౌసన్,షాకీర్, లోకేష్, చంద్రశేఖర్, బాబుమియా, రాములు పాల్గొన్నారు

# శివాలయాలలో ఘనంగా కార్తీక మాసం పూజలు



**శామీర్ పేట( జనం సాక్షి)** ఉమ్మడి మండలంలో ఘనంగా కార్తీక మాసం పూజలు నిర్వహించారు. కార్తీక మాసంలో మూడవ సోమవారం పురస్కరించుకొని ఉమ్మడి శామీర్ పేట మండలంలోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం భక్తులు పెద్ద ఎత్తున శివాలయాలకు తరలి వెళ్లి ఆయా గ్రామాలలో స్వామివార్లకు అభిషేకాలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రం శామీర్ పేట లో శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి (శివాలయం) ఆలయంలో ప్రధాన అర్చకులు గడియారం మురలీధర్ శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి రుద్రాభి షేకం అర్చన మంత్రపుష్పం చేశారు. భక్తుల గోత్ర నామాలతో అర్చన చేయగా భక్తులు స్వామివారికి పాలాభిషేకం నిర్వహించారు. భక్తులు ఉదయం నుంచి పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. రాత్రికి ఆయా గ్రామాలలోని శివాలయాల్లో కార్తీకదీపాలను వెలిగించారు. ఉమ్మడి శామీర్ పేట మండలం లోని దేవరయాంజల్, అలియాబాద్, తుర్కపల్లి, మజీద్ పూర్, లాల్ గడి మలక్ పేట, జగ్గం గూడా, కొల్తూర్, కేశవరం, మూడు చింతలపల్లి, నాగిశెట్టిపల్లి, లక్ష్మాపూర్, ఉద్దమర్రి, పొన్నాల, బొమ్మ రాశి పేట తదితర గ్రామాలలో శివాలయాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలివెళ్లి పూజలు చేశారు.

## ఘనంగా తెలంగాణా షో జంపింగ్ ఛాంపియన్‌షిప్-25

**అద్భుత ప్రదర్శన చేసిన అజామ్, ఖాలెద్, సౌర్య అమాన్**



**ఖైరతాబాద్, నవంబర్ 10 (జనం సాక్షి) :** తెలంగాణా స్టేట్ ఈక్వెస్ట్రియన్ అసోసియేషన్ (టీఎస్ ఈఏ) ఆధ్వర్యంలో జరిగిన తెలంగాణా స్టేట్ షో జంపింగ్ ఛాంపియన్‌షిప్-2025 హైదరాబా ద్‌లోని నాసర్ పోలో, ఈక్వెస్ట్రియన్ అకాడమీలో ఘనంగా ముగిసిందని నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడు తూ ఈ పోటీల్లో మీర్ నజాముద్దీన్ అజామ్, ఖాలె ద్ అలీ, సౌర్యరామ్ వర్మ ఇందుకూరి, మహమ్మద్ అమాన్ అలీ వంటి యువ, ప్రతిభావంతులైన గుర్ర పు స్వారీ రైడర్లు తమ తమ విభాగాల్లో అద్భుత మైన ప్రదర్శనలతో అందరి దృష్టిని ఆకర్షించారని చెప్పారు. బహుమతి ప్రదానోత్సవంతో ఛాంపియ న్‌షిప్ గ్రాండ్‌గా ముగిసిందన్నారు. తెలంగాణా స్టేట్ ఈక్వెస్ట్రియన్ అసోసియేషన్ అధికారులు, నాసర్ పోలో యాజమాన్యం, గౌరవ అతిథులు విజేతలకు ట్రోఫీలు, పతకాలను అందించినట్లు తెలిపారు.



## మున్సిపల్ చైర్మన్ జన్మదినం సందర్భంగా శాలువాతో ఘనంగా సన్మానం

**కొడంగల్ ,నవంబర్ 10(జనం సాక్షి) :** కొడంగల్ తాజా మాజీ మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్ రెడ్డి జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల ప్రచార కార్యదర్శి ఎస్. సోమశేఖర్ చాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ చైర్మన్ ఆయురా రోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు.

## సొమ్మును బాధితులకు అప్పగించిన పోలీసులు



**హయత్ నగర్, నవంబర్ 10 (జనం సాక్షి)** సోమవారం అబ్దుల్లాపూర్మెట్ మండలం ఇనాంగూడ గ్రామానికి చెందిన కు వనం ప్రకాష్ గౌడ్ తన ఇంటి వద్ద నుండి వారి అమ్మ తో కలిసి బైక్ పై వెళుతుండగా మార్గ మధ్యలో ఎక్కడో బ్యాగ్ పడిపోయిందని హయత్ నగర్ పోలీస్ స్టేషన్ సిఐ నాగరాజు గౌడ్, డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ సంతోష్ కుమార్ లకు ఫిర్యాదు చేశారు. తక్షణమే స్పందించి వారి సిబ్బందిని పంపించి బాధితులు పోగొట్టుకున్న బ్యాగును అందులో గల ఒక తులం బంగారం, సెల్ ఫోను సాంకేతిక పరిజ్ఞానంతో వెతికి పట్టుకొని వారికి అప్పగించారు. వారు హయత్ నగర్ పోలీస్ స్టేషన్ సిబ్బందికి ధన్యవాదములు తెలియజేశారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి



**కేశంపేట, నవంబర్ 10( జనం సాక్షి ) :** విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఎంపీడీవో రవిచంద్ర కుమార్ రెడ్డి అన్నారు. పాటిగడ్డ లోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని మండల విద్యాధికారి చంద్రశేఖర్ తో కలిసి ఎంపీడీవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు సరైన సౌకర్యాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు విద్యార్థులకు మంచి ఆహారాన్ని అందించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మల్లయ్య, పాఠశాల ప్రత్యేక అధికారి గౌసియా బేగం పాల్గొన్నారు.

## అందె శ్రీ అకాల మరణం సాహితి లోకానికి తీరని లోటు

**హయత్ నగర్, (జనం సాక్షి) :** తెలంగాణ కవి, రచయిత జయ జయహే తెలంగాణ అంటూ తెలంగాణ ఉద్యమాన్ని ఉరకలెత్తించిన జన గీతాన్ని అందించిన వాగ్గేయకారుడు, 'మాయమై పోతున్నడమ్మా మనిషన్నవాడు అంటూ మనిషితనాన్నితట్టి లేపిన దయార్థ హృదయుడు, సహజ కవి డాక్టర్ అందె శ్రీ అకాల మరణం తెలంగాణ సాహిత్య లోకానికి తీరని లోటని, ప్రజల గొంతుకలో పాటై నిత్యం ప్రతిధ్వనిస్తుండే అందెశ్రీ కి ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు జి అనసూయ తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.



## అందెశ్రీ మరణం బాధాకరం

**మాజీ జెడ్పిటిసి తాంద్ర విశాల శ్రావణ్ రెడ్డి**

**కేశంపేట్, నవంబర్ 10( జనంసాక్షి):** గేయ రచయిత అందెశ్రీ మరణం బాధాకరమైన విషయమని మాజీ జెడ్పిటిసి తాంద్ర విశాల శ్రావణ్ రెడ్డి అన్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమ సమయంలో రాష్ట్ర జాతీయ గీతమైన జయ జయహే తెలంగాణ గీతంతో ప్రజల్లో చైతన్యాన్ని రగిలించి యావత్ ప్రజానీకాన్ని ఏకతాటి పైకి తెచ్చిన అందెశ్రీ ఆకస్మిక మృతి తెలంగాణ సాహితీ లోకానికి తీరని లోటు అని అన్నారు. సాహితీ రంగంలో ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. ఆయన మరణం పట్ల ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు సానుభూతి ని తెలిపారు.

## శ్రీ కల్కిదూల వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు

**స్వామివారికి ప్రత్యేక పూజలు చేసిన రాష్ట్రఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి**

**తలకొండపల్లి మార్చి11(జనంసాక్షి):** శ్రీ కల్కిదోన గుట్టపై వెలసిన వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా గత నాలుగు రోజులుగా వైభవంగా బ్రహ్మోత్సవాల కార్యక్రమా లు నిర్వహిస్తున్నారు.స్వామివారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.అనంతరం ఆలయ కమిటీ నిర్వాహకులు శాలువాతో సత్కరించి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్ రెడ్డి,ఫౌండర్ చైర్మన్ పట్టాభి రామశర్మ,కృష్ణ మూర్తి,శ్యామ్,చలి చీమల సతీష్,సుమన్ నాయక్,తదితరులు పాల్గొన్నారు.

## కుందన సంగీత నిలయాన గరిమెళ్లవారికి స్వరనివాళి

**కుందన సంగీత నిలయ వ్యవస్థాపకులు సతీష్ సాలూరి**

**మొయినాబాద్ (జనం సాక్షి) :** మధురగాయకులు, అన్నమాచార్య పాటల స్వరకర్త గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ కుందన సంగీత నిలయాన సంగీత విద్యార్థినీ విద్యార్థులందరూ గరిమెళ్లవారికి స్వరనీరాజనాలను అందించారు.మంగళవారం నాడు సన్ సిటీ లో కార్యక్రమం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా కుందన సంగీత నిలయ వ్యవస్థాపకులు సతీష్ సాలూరి మాట్లాడుతూ గరిమెళ్ళగారికి అజ్ఞాత శిష్యులుగా ఎన్నో కీర్తనలను వారి చిననాటినుండి అభ్యసించారని ,వాటినే నేటి సంగీత విద్యార్థులకు శిక్షణలో భాగంగా అందిస్తున్నానని చెప్పారు అలాగే గరిమెళ్ల వారు ఆ శ్రీనివాసుని సన్నిధానమైన వైకుంఠాన వారి గాత్రాన్ని కొనసాగించాలని ఆ దైవాన్ని వేడుకుంటానని అన్నారు.అలాగే వారి కుటుంబానికి సంగీత నిలయం తరపున ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## గ్రంథాలయ నిర్మాణన్ని పరిశీలించిన మేడ్చల్ గ్రంథాలయ సంస్థ చైర్మన్

**శామీర్ పేట (జనంసాక్షి) :**అలియాబాద్ గ్రామంలో నిర్మించబడు తున్నటువంటి గ్రంథాలయం యొక్క భవనాన్ని మేడ్చల్ గ్రంథాలయ సంతోష్ చైర్మన్ బొంగునూరు శ్రీనివాసరెడ్డి, మేడ్చల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింలు యాదవ్ పరిశీ లించారు. ఈ సందర్భంగా గ్రంథాల చైర్మన్ బొంగు నూరు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. త్వరలోనే ఈ యొక్క గ్రంథాలయ నిర్మాణన్ని పూర్తి చేసి అందు బాటులోకి తెస్తామని అదేవిదంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రంథాలయాల అభివృద్ధికి తోడ్పాటుని స్తుందని సీఎం రేవంత్ రెడ్డి మరియు రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ రియాజ్ కృషితో మేడ్చల్ జిల్లాలో మరిన్ని గ్రంథాలయాలు ఏర్పాటు చేయబోతున్నామని అన్నారు, ఈ కార్యక్రమంలో అలియాబాద్ గ్రామస్తులు సీనియర్ కాంగ్రెస్ నాయకులు బండి రామిరెడ్డి, రాము, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఎక్సైజ్ సీఐ గోపాల్‌కు నగదు బహుమతి

**చంపాపేట్ మార్చి 11 (జనం సాక్షి) :** మలక్ పేట్ ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐగా విధులు నిర్వర్తిస్తున్న జె. గోపాల్ కుతెలంగాణ రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డైరెక్టర్ వి. బి కమలహాసన్ రెడ్డి నగదు బహుమతి అందజేశారు. మంగళవారం 2017లో మెదక్ జిల్లాలో సీఐ జే. గోపాల్ విధులు నిర్వహిస్తున్న గంగాధర్ వద్ద 4 కిలోల కల్లులో కలిపే మత్తు పదార్థం అల్ప్రజోళం స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశారు. 20 23 లో మెదక్ స్టేషన్ కోర్టు తీర్పు ఇచ్చింది. ఆయనకు 10 సంవత్సరాలు జైలు శిక్ష, రూ.1 లక్ష జరిమానా విధించింది. ఎక్సైజ్ అధికారులు సిబ్బంది అండ్ ఫోర్స్ మెంట్ డైరెక్టర్ ఐపిఎస్ కమలహాసన్ రెడ్డి గోపాల్ కు అభినందించారు. విధి నిర్వహణలో తనకు సహకరించిన అధికారులకు సహచర బృందానికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు, ఏసీలు, ఎక్సైజ్ సూపరింటెంట్, తెలంగాణ రాష్ట్ర డిసీలు, ఏసీలు, ఎక్సైజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజనాలు



**కుత్బుల్లాపూర్ నవంబర్ 10 (జనం సాక్షి) :** వైశ్య సంఘం జగద్గిరిగుట్ట శాఖ ఆధ్వర్యంలో కార్తీక వన భోజన కార్యక్రమం జగద్గిరిగుట్ట శాఖ అధ్యక్షులు పార్శీ ప్రకాష్ గుప్త, తేరాల శ్రీనివాస్ గుప్త ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పలువురు ఆర్యవైశ్య సంఘం నాయకులు మాట్లాడుతూ వైశ్యులు అన్ని రంగాలలో రాణించాలని కోరారు. ముఖ్యంగా వ్యాపార రంగంతో పాటు రాజకీయాలలో రాణించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఆర్యవైశ్య సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ గుప్తా, కుత్బుల్లాపూర్ మండల మహాసభ కార్యదర్శి దారం ఇంద్రసేన గుప్తా, జగద్గిరిగుట్ట శాఖ ట్రెజరర్ దొంతుల అన్నయ్య, జగద్గిరిగుట్ట శాఖ ఆర్యవైశ్య సంఘం యూత్ అధ్యక్షులు నరేష్ కుమార్ గుప్తా, యూత్ జనరల్ సెక్రెటరీ లింగా వేణుగోపాల్, ట్రెజరర్ రమాకాంత్, మహిళా విభాగం అధ్యక్షురాలు దుందిగల జయశ్రీ, జిల్లా లత, మేఘమాల తదితరులు పాల్గొన్నారు.

# 35 సంవత్సరాల నుండి రక్తదానం

- 1990లో మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి జన్మదినోత్సవ రోజు రక్తదానం ప్రారంభం
- నెలకు ఒకటి లేదా రెండుసార్లు రక్తదానం. .
- రెండు వందల వరకు రక్తదానం చేయడమే లక్ష్యం
- బివీజీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ సంపత్ కుమార్



తాండూరు నవంబర్ 10(జనంసాక్షి)
ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే తన ముఖ్య లక్ష్యంగా రక్తదానాన్ని ప్రారంభించడం జరిగిందని బివీజీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ సంపత్ కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సంపత్ కుమార్ జనం సాక్షితో మాట్లాడుతూ1990వ సంవత్సరం నుండి రక్తదానం చేయడం ప్రారంభించానని 2025 వరకు సుమారు163 సార్లు కక్తదానం చేసి ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం జరిగిందని తెలిపారు. మహిళలు పురుషులు, చిన్నారులు అని తేడా లేకుండా ప్రతి ఒక్కరికి రక్తదానం చేసి డాక్టర్ సంపత్ కుమార్ ఆపద్బాంధవునిగా నిలిచారు.ప్రతి నెలలో ఒకటి లేదా రెండు సార్లు రక్తదానం చేశానని వెల్లడించారు. మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి జన్మదినోత్సవం రోజు నుండి రక్తదానం ప్రారంభించినట్లు వెల్లడించారు. సుమారు 200 వరకు రక్తానం చేయడమే తన ముఖ్య లక్ష్యం అని పేర్కొన్నారు. ఎవరికైనా తన రక్తం అరుదుగా లభించే(ఓ నెగిటివ్) అవసరం ఉంటే నేరుగా తనను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. రక్తదానం చేయడం ద్వారా ఎలాంటి ఇబ్బందులు రావని తెలిపారు. కొందరు వ్యక్తులు అవగాహన లేకపోవడంతో రక్తదానం చేయడానికి భయపడతారని తెలిపారు.మానవ శరీరంలో సుమారు రక్తం నూతనంగా ఉత్పత్తి కావడానికి 72 గంటల సమయం అవుతుందని వెల్లడించారు.నిలువ ఉన్న రక్తం సుమారు 45 రోజులపాటు ఉంటుందని తెలిపారు.




## విపత్తు సమయంలో ఉపయోగిస్తాం

### తుక్కుగూడ మున్సిపాలిటీ కమిషనర్ వాణి

**మహేశ్వరం,నవంబర్10(జనంసాక్షి):** తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని వండర్లా సంస్థ నిర్వాహకులు సీఎస్ఆర్ ఫండ్స్ క్రింద డిజాస్టర్ మేనేజ్మెంట్ వాహనాన్ని సోమవారం తుక్కుగూడ మున్సిపాలిటీ కార్యాలయానికి అందజేశారు.ఈ సందర్బంగా తుక్కుగూడ మున్సిపాలిటీ కమిషనర్ వాణి మాట్లాడుతూ...విపత్తు నిర్వహణ భారీ వర్షాల సమయంలో అత్యవసర చర్యలకు వాహనం ఉపయోగపడుతుందన్నారు.ప్రజా సేవల కోసం విలువైన సహకారం అందించిన వండర్లా సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ మేనేజర్ సౌమిక్ కుమార్,సీనియర్ అసిస్టెంట్ మల్లేష్,వండర్లా సంస్థ నిర్వాహకులు మధుసూదన్,రాంబాబు,రతీష్ మౌళి,మధు,సత్యనారాయణ చారి,ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## అత్యుత్తమ ప్రతిభ కనబరిచి దేశానికే గర్వకారణంగా నిలిచిన తులసి రెడ్డి




**నిజాంపేట్ నవంబర్10 ( జనం సాక్షి) :**
నేటి యువతరంలో మట్టిలో మాణిక్యంగా వికసించి పట్టుదల కృషి ఉంటే మనిషి ఎంతటి గమ్యాన్నికైనా చేరుకోవచ్చని నిరూపించి భారతదేశానికే గర్వకారణంగా ప్రతిభ కనబరిచిన హైదరాబాదులోని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ దుండిగల్ మున్సిపల్ మున్సిపల్ బౌరంపేట్ గ్రామ ముద్దుబిడ్డ తులసి రెడ్డి ఐరన్ మాన్70.3 మైళ్ళ పోటీల్లో ప్రతిభ చూపి చూపినందుకు ఆయనపై సోమవారం అభినందనలు ప్రశంసల జల్లు కురిపించారు. గోవాలో ఇటీవల జరిగిన ఐరన్ మాన్ 70.3 మైళ్ళరాయి పోటీల్లో పాల్గొన్న తులసి రెడ్డి.యువతకు ఆదర్శంగా నిలిచి, ఒక్కో మెట్టు ఎదుగుతూ అనేక పర్వత శిఖరాలను అధిరోహిస్తున్న, మొత్తం 113 కిలోమీటర్ల దూరం ఉండే ఈ పోటీ మూడు విభాగాలుగా నిర్వహించబడ గ 1.9 కి.మీ. సముద్రంలో ఈత, 90 కి.మీ. సైక్లింగ్ చేస్తూ తరువాత 21.1 కి.మీ. హాఫ్ మారథాన్ పరుగు ద్వారా ఓకేరోజు వరుసగా విరామం లేకుండా చేరుకోవాలి.ఇంత కఠినమైన పోటీని కేవలం 7గంటల 30 నిమిషాల్లో చేరుకొని మన నియోజకవర్గానికే కాకా మన భౌరంపేట్ గ్రామానికి 17:28:24 తీసుకురావడం గర్వకారణం గా ఉందని గ్రామస్తులు మిత్రులు అభినందనలు తెలియజేశారు.ఇంత గొప్ప పోటీలో పాల్గొని ప్రతిభ చూపాలి అంటే ప్రతిరోజు శిక్షణ, సమయపాలన, పట్టుదల, క్రమశిక్షణ, ఆహార నియమాలు పాటిస్తూ ఇంతటి మైలురాయి చేరుకున్న తులసిరెడ్డి కి కుటుంబసభ్యులు, గ్రామస్థులు, మిత్రులు అభినందనలు తెలియజేశారు.

## ఉద్దమర్రి, లక్ష్మపూర్ లల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవం

**శామీర్ పేట్ ( జనం సాక్షి)**
మూడు చింతలపల్లి మున్సిపాలిటీ పరిధి లోని మూడుచింతలపల్లిలోని లక్ష్మాపూర్, ఉద్దమర్రి గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జి తోటకూర వజ్రెష్ యాదవ్ , మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మల పల్లి నరసింహులు యాదవ్, శామీర్ పేట్ సొసైటీ చైర్మన్ మధుకర్ రెడ్డిలు పాల్గొని కొనుగోలు కేంద్రా లను ప్రారంభించి రైతులతో ముచ్చటించారు.
ఈ సందర్భంగా వజ్రెష్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం పలు కార్యక్రమా లను అమలు చేస్తోంది.రైతులు సమయానికి ధాన్యం విక్రయించుకోవాలని, ప్రతి రైతుకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకరిస్తుందని తెలిపారు.

## తెలంగాణ గీతంతో ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన డాక్టర్ అందే శ్రీ గారి మరణం తీరని లోటు



**రాష్ట్ర గీతం రచయిత అందెశ్రీ రచయితకు నివాళి.**

**కవయిత్రి మొల్ల కళావేదిక ఫౌండర్ అధ్యక్షులు కేవిఎం వెంకట్.**

**తాండూరు నవంబర్ 10(జనంసాక్షి) :** వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గం పెద్దేముల్ మండలం మంబాపూర్‌లో తెలంగాణ రాష్ట్ర గీతాన్ని రచించిన ప్రసిద్ధ కవి, గాయకుడు డాక్టర్ అందే శ్రీ అకాల మరణం పట్ల మంబాపూర్‌లోని మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల బాలుర పాఠశాలలో శ్రద్ధాంజలి కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కవయిత్రి మొల్ల కళావేదిక ఫౌండర్ అధ్యక్షులు కేవిఎం వెంకట్ హాజరయ్యారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ పీయూష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. డాక్టర్ అందే శ్రీ చిత్రపటానికి పూలమాల వేసి, కొవ్వొత్తులు వెలిగించి మౌనం పాటించి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో కవయిత్రి మొల్ల కళావేదిక ఫౌండర్ అధ్యక్షులు కేవిఎం వెంకట్ మాట్లాడుతూ తెలంగాణ గీతంతో ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన డాక్టర్ అందే శ్రీ మరణం తీరని లోటు. ఆయన చేసిన సేవలను ప్రభుత్వం గుర్తించాలి. ఆయన ఆశయాలను విద్యార్థులు ముందుకు తీసుకెళ్లాలి అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం రజియా సుల్తానా, రమేష్, వేణుగోపాల్ ,రాములు ,నగేష్, యాదయ్య ,శంకర్ రాజు ,తిరుమలేష్ విద్యార్థులు పాల్గొన్నారు.

# ఈనెల 11నుంచి 20 స్కూళ్లలో జిల్లా స్థాయి క్రీడా పోటీలు

- పాల్గొననున్న 12,570 బీసీ గురుకుల విద్యార్థులు
- రాష్ట్ర క్రీడా పాలసీకి అనుగుణంగా విద్యార్థులకు శిక్షణ
- జిల్లా స్థాయి విజేతలతో రాష్ట్ర స్థాయి పోటీలు
- బీసీ గురుకుల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు



తరగతి గదిలో పుస్తకాలతో కుస్తీ పట్టే విద్యార్థులకు ఆటవిడుపు గా అనేక క్రీడల్లో పోటీలు నిర్వహిస్తున్నామని మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ బీసీ గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు గారు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి పది జిల్లాల్లోని 20 ప్రాంగణాల్లో ఈనెల 11వ తేదీ నుంచి 13 వ తేదీ వరకు నిర్వహించే జిల్లా స్థాయి స్పోర్ట్స్ మీట్ లో 294 గురుకుల పాఠశాల నుంచి 12570 మంది విద్యార్థులు పాల్గొంటారని ఆయన సోమవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. 19 సంవత్సరాల లోపు విభాగ ంలో ప్రతి స్కూల్ నుంచి 20 మంది విద్యార్థులు , 14 సంవత్సరాల లోపు విభాగంలో ప్రతి స్కూల్ నుంచి 25 మంది విద్యార్థులు పాల్గొంటారన్నారు. 19సంవత్సరాల లోపు విభాగంలో 5220 మంది విద్యార్థులు, 14 సంవత్సరాల లోపు విభాగంలో 7350 మంది విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు.
మూడు రోజులపాటు జరిగే జిల్లా స్థాయి స్పోర్ట్స్ మీట్ లో పాల్గొన్నే విద్యార్థులకు రన్నింగ్, లాంగ్ జంప్, హైజంప్, షార్ట్ పుట్, డిస్క్ త్రో, కబడ్డీ, కోకో, వాలీబాల్, టెన్నికాయిట్, చెస్ తదితర ఆట పోటీలను నిర్వహిస్తామన్నారు. ఈ పోటీలలో పాల్గొని విజేతలుగా నిలిచిన విద్యార్థులకు రాష్ట్రస్థాయిలో త్వరలో స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తామని ఆయన తెలిపారు. విద్యార్థుల్లోని ప్రతిభ ను గుర్తించి వారికి అవసరమైన శిక్షణ ఇచ్చి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జరిగే క్రీడా పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తామన్నారు. ఈనెల 6వ తేదీ నుంచి 8వ తేదీ వరకు 17 సంవత్సరాల లోపు విభాగంలో నిర్వహించిన పోటీల్లో 294 బీసీ గురుకుల పాఠశాల నుంచి 10290 విద్యార్థులు పాల్గొన్నారని ఆయన పేర్కొన్నారు. ఈనెల 15 వ తేదీ నుంచి 25 వ తేదీ వరకు జిల్లా స్థాయిలో సాంస్కృతిక , సాహిత్య, వక్తృత్వ, వ్యాసరచన, చిత్రలేఖనంలో పోటీలను నిర్వహిస్తామన్నారు. ఈ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఎంపికైన విద్యార్థులు వచ్చేనెల రాష్ట్ర స్థాయిలో నిర్వహించే కల్చరల్ కార్నివాల్ లో పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. చదువుతోపాటు అన్ని రంగాలలో రాణించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గారి సూచన మేరకు ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని కార్యదర్శి సైదులు గారు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



కేశంపేట, నవంబర్ 10 (జనం సాక్షి ) : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. సిఐ నరహరి తెలిపిన వివరాల ప్రకారం.. పాపిరెడ్డి గూడ గ్రామానికి చెందిన అబ్బి మల్లేష్ (45) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మల్లేష్ సోమవారం ఉదయం స్ప్లెండర్ ప్లస్ బైక్ పై తన అమ్మమ్మ ఊరు కాకునూరు కు బయలుదేరాడు. మార్గ మధ్యలో కేశంపేట శివారులోని చంద్రకళ గార్డెన్ సమీపంలోకి రాగానే తన ముందు వెళుతున్న సైకిల్ ను దాటే క్రమంలో బైక్ అదుపు తప్పి రోడ్డు పై పడ్డాడు. బైక్ హ్యాండిల్ మల్లేష్ తలకు బలంగా తగలడంతో తీవ్ర గాయాలై ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. ఘటనా స్థలానికి చేరుకొన్న పోలీసులు మృత దేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం షాద్ నగర్ ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించారు. గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో మల్లేష్ మృతి చెంది ఉంటాడని కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తునట్టు, మృతుని బాబాయి అబ్బి బిక్షపతి ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ నరహరి తెలిపారు.